# సన్మానంలో బ్రేక్

కాలనాథభట్ల వీరభద్రశాస్త్రి

శాస్త్రిగారు కుటుంబ సభ్యులతో (షరా: పెద్ద వాళ్లతోనే) టీవీలో అలనాటి పురాణచిత్రం ద్రౌపదీ మానసంరక్షణ చూస్తున్నారు. ఆశ్చర్యం! ఇంత పాత చిత్రం ఎలా దొరికిందో ఈ ఛానల్ వారికి.

ఒక అరగంట అయ్యేసరికి అందరికీ విసుగొచ్చింది.

అహహ! తమరు అపార్ధం చేసుకోవద్దు. విసుగెత్తడం చిత్రం బాగుండకకాదు. ఒక అరగంట సేపట్లో నాలుగుసార్లు బ్రేక్ అంటూ చూపించిన ప్రకటనలే చూపిస్తూ కాలయాపన చేస్తున్నందుకు. అయినా ఓపిక వహించి చిత్రం చూస్తున్నారు.



తమకు తెలియందేముంది? ఘనమైన రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు కరెంట్ కట్... రోజూ నాలుగు గంటలు తప్పనిసరి. కోతలో ఈ సమయం ఒకటి. ఇంకేంవుంది... రెండు గంటల వరకూ మళ్లీ కరెంట్ రాదు. అప్పటికి సినిమా చూపించడం అయిపోతుంది. వుసూరుమంటూ వెళ్లి నిద్రకుపక్రమించారు.

* * *

ఆ సభాప్రాంగణం జనంతో క్రిక్కిరిసి వుంది. ప్రక్క కర్టెను నుంచి కార్యదర్శి ప్రవేశి స్తాడు.

కార్యదర్శి: సభకు నమస్కారం. ఈనాడు ఎంతో సుదినం. ప్రఖ్యాత టీవీ ఛానల్ నిర్మాత గారిని ఇటీవల ప్రదర్శింపబడుతున్న వారి 'భయం భయం బాబోయ్' అనే సీరియల్ అయిదువందల ఎపిసోడ్లు పూర్తయిన సంద ర్భంగా మా సంఘం తరపున పురజనుల కోరి కపై వారికి ఈ సన్మాన సభ ఏర్పాటుచేయడమై నది. ఇప్పుడు ఈనాటి ఈ సన్మాన సభకు అధ్య క్షత వహించవలసిదిగా మా సంఘ అధ్యక్షుల వారిని వేడుతూ వేదికమీదకు రావలసిందిగా కోరుతున్నాను.

చప్పట్లు...

ఇప్పుడు ప్రఖ్యాత టీవీ ఛానల్ నిర్మాతగారిని వేదికమీదకు రావలసిందిగా సగౌరవంగా వినయపూర్వకంగా వేడుతున్నాను.

మళ్ళీ చప్పట్లు.

ఆలస్యం చేయకుండా మా అధ్యక్షులవారిని సభను ప్రారంభించవలసిందిగా కోరుతున్నాను.

అధ్యక్షుడు: సభకు నమస్కారం. వేదికను అలంకరించిన ప్రఖ్యాత టీవీ ఛానల్ నిర్మాత గారికి ప్రత్యేక అభివందనములు. సారీ... వారు నాకన్నా వయస్సులో చిన్నవారు కనుక అభినం దనలు.

ఇప్పుడు బ్రేక్...

కార్యదర్శి: ఒక ప్రకటన... మీకు రుచికర మైన వంటకములతో అద్భుతమైన భోజనం కొరకు కడప విలాస్‌ని దర్శించండి. ఒకసారి వెళ్తే ఇక అసలు మీ ఇంటి భోజనం చేయరు. టింగ్... టింగ్... (అని స్టీలు పళ్లాన్ని గరిటెతో వాయిస్తాడు).

అధ్యక్షుడు: వీరు నాకన్నా వయస్సులో చిన్న వారు కనుక అభినందనలు. వీరు భయం భయం బాబోయ్ అనే తమ టీవీ సీరియల్ అయిదు వందల ఎపిసోడ్లు గత ఏడాదిన్నర నుండి ప్రసారం చేసిన, ఇంకా చేయబోతున్న సందర్భంగా పురజనుల కోరికపై ఈ సన్మానం చేయబడుతోంది. ఇప్పుడు కొంచెం విరామం.

కారదర్శి: ఒక ప్రకటన... మీకు రుచికర మైన వంటకములతో అద్భుతమైన భోజనం కొరకు కడప విలాస్‌ని దర్శించండి. ఒకసారి వెళ్తే ఇక అసలు మీ ఇంటి భోజనం చేయరు టింగ్... టింగ్... (అని స్టీలు పళ్లాన్ని గరిటెతో వాయిస్తాడు).

అధ్యక్షుడు: వీరు భయం భయం బాబోయ్ అనే తమ టీవీ సీరియల్ అయిదు వందల ఎపిసోడ్లు గత ఏడాదిన్నరనుండి ప్రసారం చేసి న, ఇంకా చేయబోతున్న సందర్భంగా పురజ నుల కోరికపై ఈ సన్మానం చేయబడుతోంది... వీరి సీరియల్‌లో ఇప్పటికి రెండువందల పాత్ర లను ప్రవేశపెట్టారు. ఎన్నో సంఘటనలు చోటు చేసుకున్నాయి. అన్ని పాత్రలను, అన్ని సంఘ టనలనూ గుర్తుపెట్టుకోవడం ప్రేక్షకుల మేధా శక్తిపై ఆధారపడివుంది. అంటే ఈ విధంగా ప్రేక్షకుల మేధాశక్తిని పెంపొందింపజేస్తున్నారు. ఇప్పుడు బ్రేక్.

కార్యదర్శి: ఒక ప్రకటన! మీకు రుచికరమైన వంటకములతో అద్భుతమైన భోజనం కొరకు కడప విలాస్‌ని దర్శించండి. ఒకసారి వెళ్లితే ఇక అసలు మీ ఇంటి భోజనం చేయరు. టింగ్... టింగ్... (అని స్టీలు పళ్లాన్ని గరిటెతో వాయిస్తాడు).

అధ్యక్షుడు: వీరి సీరియల్‌లో ఇప్పటికి రెండువందల పాత్రలను ప్రవేశపెట్టారు. ఎన్నో సంఘటనలు చోటుచేసుకున్నాయి. అన్ని పాత్రలను, అన్ని సంఘటనలను గుర్తుపెట్టుకోవడం ప్రేక్షకుల మేధాశక్తిపై ఆధారపడివుంది. అంటే ఈ విధంగా ప్రేక్షకుల మేధాశక్తిని పెంపొందింపజేస్తున్నారు. ఇప్పుడు బ్రేక్... ఇది నిజంగా ఒక అద్భుతమైన ప్రయోగమే. ఇందుకు వారెంతో అభినందనీయులు. ఇప్పుడు బ్రేక్.

ఒక ప్రేక్షకుడు: ఆగండి... ఆగండి... ఇందాకట్నుంచి గమనిస్తున్నా! మీరు కొంచెం చెప్పి బ్రేక్ అనడం, మీ కార్యదర్శిగారు కడప విలాస్ గురించి చెప్పడం... ఏమిటి మీవుద్దేశ్యం? మేము మీరు చెప్పే చెత్త ప్రకటన వినడానికి వచ్చిన మూర్ఖులమనుకున్నారా?

అధ్యక్షుడు: క్షమించాలి. ఈ సన్మాన కార్యక్రమానికి ప్రాయోజకులు కడప విలాస్ వారు. సహప్రాయోజకులు ఎవరూ దొరక్కపోవడంతో మొత్తం ఖర్చు కడప విలాస్ వారినే భరించమంటే ఈ సన్మానంలో ఇరవైసార్లు తమ హోటల్ గురించి ప్రకటన చేసే నిబంధన మీద మొత్తం ఖర్చు భరించడానికి వొప్పుకున్నారు. సన్మానం చేయించుకునే నిర్మాతగారికి ఏ అభ్యంతరం లేదని వారి దగ్గర హామీ పుచ్చుకున్నాం కూడా.

ప్రేక్షకుడు: ఏమండీ నిర్మాతగారూ! నిజమా!

నిర్మాత: అవునండీ. ప్రాయోజకులు లేకపోతే ఏ కార్యక్రమమైనా నడవదని నాకు అనుభవపూర్వకంగా తెలుసు. కనుక దయచేసి మీరు కూర్చోవలసిందిగా ప్రార్థన.

ప్రేక్షకుడు: ఛీ సిగ్గులేదటయ్యా! లేవండ్రా! ఈవేళ వీడి సంగతి చూడాలి...

* * *

ఆగండి... దయచేసి వారిని ఏమీ చెయ్యవద్దు. ఆగండి ప్లీజ్... ఆగండి...

ఏమిటండీ అలా అరుస్తున్నారు. మళ్ళీ ఏమన్నా కలగన్నారా ఏమిటి కొంపతీసి? లేవండి బారెడు పొద్దెక్కింది...

## జాతీయస్థాయి అవార్డుకు కవితలకు ఆహ్వానం

నిరంతర సాహిత్య పాఠశాలగా వెలుగొందుతూ రజతోత్సవాన్ని చేసుకున్న "ఎక్స్‌రే" సంస్థ జాతీయస్థాయి అవార్డుకు కవితలను ఆహ్వానిస్తోంది. ప్రధాన అవార్డుకు ఎంపికైన కవితకు ఐదు వేల రూపాయల నగదుతోపాటు జ్ఞాపిక, సత్కారము, మరో పది కవితలకు ఉత్తమ కవితా పురస్కారాలు ఇవ్వబడతాయి. చారిత్రక వికాసాన్ని క్రమపద్ధతిలో పదిలపరచే ఈ ప్రయత్నంలో కవులు పాల్గొనవలసిందిగా 'ఎక్స్‌రే' అధ్యక్షుడు శ్రీ కొల్లూరి కోరుతున్నారు. కవితా వస్తువు, పరిధి విషయాల్లో కవికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. సుదీర్ఘ కవితలు పరిశీలించబడవు. డిశంబరు 25న విజయవాడలో జరిగే సభలో ఈ అవార్డులు బహుకరించబడతాయి. కవితలు పంపేవారు ఎక్స్‌రే చందాదారులై ఉండాలి. సంవత్సర చందా రు. 75/-లు ఎక్స్‌రే పేర యం.ఓ. చెయ్యాలి. పేరు, చిరునామా కవితపై కాకుండా హామీపత్రంపై వ్రాయాలి. కవితలు నవంబర్ 30వ తేదీలోగా ఎక్స్‌రే, 28-15-2, దాసు వారి వీధి, అరండల్ పేట, విజయవాడ-2 అనే చిరునామాకు పంపించాలి. ఇతర వివరాలకు 98481 21763 కి ఫోన్ చేయవచ్చు.